ప్రజాశక్తి
శనివారం 6 డిసెంబర్ 2025 | 5 | అనంతపురం

'పవర్ గ్రిడ్' నిర్వాసిత రైతు ఆత్మహత్యాయత్నం

పరిహారం ఇవ్వటంలో వివక్ష చూపారంటూ ఆవేదన

భూములు కోల్పోయిన రైతులకు అరకొర నష్టపరిహారం

రైతులకు అన్యాయం జరిగితే పనులు ఆపేస్తామంటున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - తాడిపత్రి రూరల్

జిల్లాలోని రాయదుర్గం నుంచి తమిళనాడు వరకు పవర్ గ్రిడ్ విద్యుత్ లైను ఏర్పాటు కోసం భూమి కోల్పోయిన తాడిపత్రి మండలాన్ని చెందిన రైతు తనకు పరిహారం అందించడంలో అన్యాయం జరిగిందంటూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు రైతును అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు... జిల్లాలోని రాయదుర్గం నుంచి తమిళనాడు వరకు పవర్ గ్రిడ్ విద్యుత్ లైను ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ విద్యుత్ లైన్ వెళుతున్న పొలాలకు సంబంధించిన రైతులకు పరిహారం చెల్లిస్తోంది. ఈనేపథ్యంలో తాడిపత్రి మండలంలో ఆ విద్యుత్తు లైన్ కింద ఉన్న భూములు కోల్పోతున్న రైతులకు పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ అన్యాయం చేస్తుందంటూ మండల రైతులు వాపోతున్నారు. విద్యుత్ లైన్ వెంబడి ఉన్న భూములకు చెల్లించే నష్టపరిహార విషయంలో అవకతవకలుగా ఉన్నాయని రైతులు అక్కడి అధికారులకు కాంట్రాక్టర్లకు విన్నవించుకుంటున్న సంస్థ సిబ్బంది అవేమీ లెక్కచేయడం లేదు. ఒక్కొక్కరికి ఒక్కో విధంగా పరిహారం చెల్లిస్తున్నారు. మండల పరిధిలోని ఎర్రగుంటపల్లికి చెందిన గంగాధర అనే రైతుకు చెందిన సర్వేనెంబర్ 32లో విద్యుత్ లైన్ వెళుతోంది. అయితే రైతు గంగాధర్‌కు పరిహారం ఇవ్వటంలో సంస్థ సిబ్బంది వివక్ష చూపుతున్నారని బాధిత రైతు విమర్శిస్తున్నాడు. పక్క పొలం రైతుకు ఇచ్చినంత కూడా తమకు ఇవ్వలేదని అధికారులను పలుమార్లు అడిగినప్పటికీ స్పందించకపోవడంతో మనస్థాపానికి గురైన గంగాధర్ శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు రైతు గంగాధర్ ను చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇదిలా ఉంటే పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆయా గ్రామస్తులు వాపోతున్నారు.

రైతు గంగాధర్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

పవర్ గ్రిడ్ పై ఫిర్యాదు చేస్తాం : జేసీ ప్రభాకర్‌రెడ్డి

రైతులకు అన్యాయం చేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పవర్ గ్రిడ్ సంస్థ పై ఫిర్యాదు చేస్తామని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. పవర్ గ్రిడ్ సంస్థ ఎక్కడో ఒక జిల్లాలో తీసుకున్న నిర్ణయాన్ని అన్ని జిల్లాలకు అమలు చేస్తే ఎలా సరిపోతుందని ప్రశ్నించారు. ఇక్కడి అధికారులతో కలిసి రైతులను పిలిపించి వారి అభిప్రాయం మేరకు రేటు నిర్ణయించి పనులు ప్రారంభించాలన్నారు. ఎక్కడో ఒక జిల్లాలో కూర్చొని అక్కడ తీసుకున్న నిర్ణయాన్ని అన్ని జిల్లాలకు వర్తింపజేయడం సరైంది కాదని అన్నారు. రైతాంగానికి అన్యాయం జరగకుండా పోరాటం చేస్తామని అన్నారు. ఇప్పటికైనా జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, తహశీల్దార్ తదితరులు రైతులతో కలిసి రైతుల అభిప్రాయం మేరకు ధర నిర్ణయించి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. దీనిపై రైతులతో కలిసి ఫిర్యాదు చేస్తామని అలాగే డిసెంబర్ 15 నుంచి పవర్ గ్రిడ్ పనులు ఆపేస్తామని హెచ్చరించారు.

2013 భూ సంస్కరణ చట్టాన్ని అమలు చేయాలి : ఏపి రైతుసంఘం

పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ రైతాంగానికి అన్యాయం చేయకుండా 2013 భూ సంస్కరణ చట్టాన్ని అమలు చేసి భూములు కోల్పోతున్న రైతులకు అక్కడి మార్కెట్ ధర ప్రకారం రెండున్నర రెట్లు ఎక్కువగా నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు రాజారాంరెడ్డి డిమాండ్ చేశారు. పరిహారం విషయంలో అన్యాయం జరిగిందని తాడిపత్రి మండలం ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన గంగాధర అనే రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని అన్నారు. రైతుకున్న పొలం మొత్తం పవర్ గ్రిడ్డుకే పోతే ఆయన కుటుంబ జీవనం ఎలా అని ప్రశ్నించారు. రైతుకు ఇంత నష్టం జరుగుతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని అలాగే కాంట్రాక్టర్లకు వత్తాసు పలికే పోలీసులపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు అన్యాయం చేసే విధంగా వ్యవహరిస్తే రైతులతో కలిసి న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు.

రైతు చుట్టూ రాజకీయం

వ్యాపారంలో నష్టాలే ఆత్మహత్యకు కారణమంటున్న అధికారపార్టీ

గిట్టుబాటు ధర లేకపోవడమే అంటున్న వైసిపి

రాజకీయాలు మాని రైతులను ఆదుకోవాలన్న రైతు, ప్రజాసంఘాలు

నాగలింగం మృతదేహానికి ఎమ్మెల్యే నివాళి

నాగలింగం అంత్యక్రియల్లో వైసిపి నాయకులు



విలేకరుల సమావేశంలో ఏపి రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతి నిధి/ పుట్లూరు

పుట్లూరు మండలం వెల్లుట్ల గ్రామానికి చెందిన అరటి రైతు నాగలింగం ఆత్మహత్య చుట్టూ రాజకీయరంగు పులుముకుంటోంది. అప్పుల బాధతో పొలంలో పురుగుల మందుతాగి నాగలింగం గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నాగలింగం మృతదేహాన్ని పోస్టుమార్గం నిమిత్తం గురువారం సాయంత్రం అనంతపురం సర్వజన ఆసుపత్రికి తీసుకొచ్చారు. అరటిరైతు కావడంతో ఆలస్యమయితే విపక్షాల నుంచి ఆందోళన మొదలయ్యే అవకాశముందని భావించి శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల్లోపే పోస్టుమార్టం నిర్వహించి పోలీసు బలగాలతో మృతదేహాన్ని పుట్లూరు మండలం వెల్లుట్లకు తరలించే చర్యలు చేపట్టారు. ఆ సమయానికి శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, అటు వైసిపి శింగనమల సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజనాథ్ అక్కడికి చేరుకున్నారు. ఇంత ఉదయాన్నే పోస్టుమార్టం నిర్వహించి తీసుకెళ్లడం ఏమిటని శైలజనాథ్ ఆరా తీస్తుండగా, అక్కడేవున్న బండారు శ్రావణి తాము వారికి ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా అండగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని శైలజనాథ్‌ను ఉద్దేశించి మాట్లాడారు. ఇలా ఇద్దరి మధ్య సంభాషణ అనంతరం ఇద్దరూ మీడియాతో మాట్లాడారు.

ప్రభుత్వ తీరు బాగోలేదు : వైసిపి

ఇది ముమ్మాటికి ప్రభుత్వ హత్యనే. అరటి రైతుకు సరైన గిట్టుబాటు ధరలేదని, కల్పించాలని తాము ముందు నుంచి కోరుతూ వస్తున్నాం. కాని ప్రభుత్వం ఒక్క కిలో అరటినీ ఇప్పటి వరకు కొనుగోలు చేయలేదు అని వైసిపి శింగనమల ఇన్‌ఛార్జి శైలజనాథ్ విమర్శించారు. మృతిచెందిన నాగలింగం కుటుంబసభ్యులను పరామర్శించడానికి వస్తే హడావుడిగా పోస్టుమార్టం పూర్తి చేసి మృతదేహాన్ని తరలిస్తున్నారన్నారు. పైగా నాగలింగం రైతే కాదన్నట్టుగా చెప్పే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వ్యాపారంలో వచ్చిన నష్టాలతోనే చనిపోయినట్టుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. నాగలింగం తనకు ముందు నుంచి తెలుసని ఆయనకు పొలం కూడా ఉందని చెప్పారు. ఏది ఏమైనా ప్రభుత్వ తీరు రైతుల విషయంలో సరిగా లేదని విమర్శించారు. రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

రైతునాగలింగం (ఫైల్‌ఫొటో)

వ్యాపారంలో వచ్చిన నష్టాలతోనే నాగలింగం ఆత్మహత్య : టిడిపి

నాగలింగం అరటి వ్యాపారం చేసేవాడని అందులో వచ్చిన నష్టాలతోనే నాగలింగం ఆత్మహత్య చేసుకున్నాడని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి అన్నారు.. అయినా ప్రభుత్వం ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. వ్యక్తిగతంగా మృతుని కుటుంబసభ్యులకు అండగా ఉంటామని అన్నారు. వారి పిల్లలు చదుకుంటామంటే ఎన్టీఆర్ ట్రస్టులోనూ చదివిస్తామన్నారు. నాగలింగం ఆత్మహత్యపై వైసిపి శవరాజకీయాలు చేయాలని చూస్తోందని విమర్శి:చారు. ఇది సరైంది కాదని అన్నారు .

గత వైసిపి నిర్వాకంతోనే నాగలింగం ఆత్మహత్య : అచ్చెన్నాయుడు

నాగలింగం ఆత్మహత్యకు 2021 నుంచి 2024 మధ్య కాలంలో వచ్చిన నష్టాలే కారణమని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చంనాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నాగలింగం అనే వ్యక్తి 0.83 సెంట్లు మాత్రమే భూమి ఉందన్నారు. మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని పంట సాగు చేశాడన్నారు. దీంతోపాటు అరటి ట్రేడింగ్ చేసేవాడన్నారు. అందులో నష్టాలొచ్చి అప్పులు పెరిగిపోవడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని అన్నారు. ఏది ఏమైనా నాగలింగం మృతి బాధాకరమన్నారు. ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకుంటుందని చెప్పారు. అయితే దీన్ని వైసిపి శవరాజకీయాలు చేసి ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు.

నాగలింగం ఆత్మహత్య చుట్టూ రాజకీయ రంగు

నాగలింగం ఆత్మహత్య అనంతరం జరిగిన పరిణామాలపై రెండు పార్టీల నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడంతో రాజకీయ రంగు పులుముకుంటోంది. వాస్తవానికి ఈ ఏడాది అరటి పంటకు సరైన గిట్టుబాటు ధర లేక చాలా మంది రైతులు తీవ్రమైన ఇబ్బందులు పడ్డారు. కొనేందుకు కూడా వ్యాపారులు ముందుకురాకపోవడంతో పొలాలను దున్నేసిన సందర్భాలూ ఉన్నాయి. ఎకరానికి ఒకటిన్నర లక్షల రూపాయల వరకు పెట్టుబడులు పెట్టి గిట్టుబాటు ధర లేక అరటి రైతు తీవ్రంగా నష్టపోయారు. వారిని ఆదుకోవాలని గత నెల ఆరంభంలోనే ఏపి రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆ తరువాత వైసిపి కూడా ధర్నా నిర్వహించింది. అనంతరం జిల్లా కలెక్టరు ఆనంద్ వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసి ఆరు రూపాయలకు తక్కువ కాకుండా కొనుగోలు చేయాలని తెలిపారు. అయినా కొనేవారు రాక రైతులు ఇబ్బందులు పడుతూవచ్చారు. ప్రభుత్వం మాత్రం దీని కొనుగోలు చేపడతామంటూ ప్రకటనలు చేసింది కాని ఇంత వరకు కొనుగోలు ఆరంభించలేదు. ఈ క్రమంలోనే నాగలింగం ఆత్మహత్య చేసుకోవడం రాజకీయ రంగు పులుముకుంటోంది.

నాగలింగం అంత్యక్రియల్లో అనంత, శైలజానాథ్: ఆత్మహత్యకు పాల్పడిన అరటి రైతు నాగలింగం అంత్యక్రియల్లో వైసిపి జిల్లా అధ్యక్షులు అనంతవెంకటరామిరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త శైలజనాథ్, నాయకులు సత్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్లు మహేశ్వర్ రెడ్డి గువ్వల శ్రీకాంత్ రెడ్డి ఖాదర్ వలీ ఖాన్ పూల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు నాయకులు మాట్లాడుతూ .ముఖ్యమంత్రి చంద్రబాబు అసమర్థత కారణంగానే రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నాయని విమర్శించారు. అనంతపురం జిల్లాను ఆత్మహత్యలకు నిలయంగా మార్చొద్దని ప్రభుత్వాన్ని కోరారు. కూటమి ప్రభుత్వం కళ్లు తెరిపించడానికి ఈనెల 8వ తేదీన కలెక్టరేట్ లేదా జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని తెలిపారు.

నాగలింగం మృతి విచారకరం : టిడిపి

అరటి రైతు నాగలింగం ఆత్మహత్య బాధాకరని టిడిపి నాయకులు అన్నారు. ఈసందర్భంగా మృతుని కుటుంబసభ్యులను టిడిపి నాయకులు పరామర్శించారు. తక్షణ సాయం కింద ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మృతుని కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు ముంటిమడుగు శ్రీనివాస్ రెడ్డి , జీ.సీ.రామానాయుడు , ఓబులాపురం శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు టిడిపి నాయకులు మాట్లాడుతూ సున్నితమైన సమయంలో కూడా వైసీపీ నేతలు రాజకీయ ప్రయోజనాల కోసం ప్రయత్నించడం అనైతికమన్నారు. కుటుంబ పెద్దదిక్కుని కోల్పోయి వారు బాధలో ఉంటే ఈ రాజకీయాలు ఏమిటని ప్రశ్నించారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు.

అరటి రైతు నాగలింగం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి : ఏపి రైతుసంఘం

శింగనమల నియోజకవర్గం పుట్లూరు మండలంలోని ఎల్లుట్ల గ్రామానికి చెందిన అరటి రైతు నాగలింగం ఆత్మహత్య బాధాకరమని రైతు నాగలింగంది ప్రభుత్వ హత్యే అని ఏపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్ చంద్రశేఖర్ రెడ్డి జిల్లా అధ్యక్షులు బి హెచ్ రాయుడు, పండ్లతోటల రైతుసంఘం జిల్లా కార్యదర్శి వి శివారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక రైతుసంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న అరటి రైతు నాగలింగం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అరటి ధరలు అమాంతం పడిపోవడంతో పంట సాగుకు చేసిన అప్పు తీర్చే మార్గం లేక నాగలింగం గురువారం తన స్వగ్రామంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. చేతికొచ్చిన పంటలు అమ్ముకునే సమయానికి గిట్టుబాటు ధర లభించడం లేదని, ఈ క్రమంలోనే అప్పులు భారం మోయలేక రైతులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అరటి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని,టన్ను రూ.15వేలుతో ప్రభుత్వం కొనుగోలు చేయాలని, నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 50వేలు నష్టపరిహారం ఇవ్వాలని రైతు సంఘాలు, వామపక్ష, ప్రతి పక్షపార్టీలు ఆందోళన చేస్తున్న ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెబుతున్న మాటలు రైతన్న మీకోసం ప్రోగ్రాం రైతులకు భరోసా కల్పించే విధంగా లేకపోవడంతోనే రైతు నాగలింగం ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. అరటి ,మొక్క జొన్న, పత్తి, వరి, కంది పంటలకు గిట్టుబాటు ధర తో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతు నాగలింగం కుటుంబాన్ని ప్రభుత్వం దత్తత తీసుకుని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్, తదితరులు

విద్యాభివృద్ధికి కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - ఆత్మకూరు

విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. ఆత్మకూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం, మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ 3. కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు కలెక్టర్‌కు ఘన స్వాగతం పలికారు. ముందుగా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపు, ఆర్.ఓ ప్లాంట్ ను కలెక్టర్ పరిశీలించారు పాఠశాల సైన్స్ ఎగ్జిబిషన్, విద్యార్థినీ విద్యార్థులు తయారు చేసిన సైన్సు, ఆర్ట్స్, క్రాఫ్ట్స్ నమూనాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల విద్యాభ్యాసం పట్ల శ్రద్ధ కనపర్చాలన్నారు. పాఠశాల విద్యార్థి, సర్పంచి వరలక్ష్మి కుమారుడు జనిత్ హర్ష మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ ఆనంద్ ముఖచిత్రాన్ని గీసి కలెక్టర్‌కు చూపించడంతో ఆయన హర్షం వక్తం చేసి విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపిసి శైలజ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.లక్ష్మీదేవి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బొమ్మయ్య, సర్పంచి వరలక్ష్మి, ఎంపిపి హేమలత, రాష్ట్ర చిన్న పరిశ్రమల శాఖ సభ్యులు వెంకటనారాయణ, ఎంపిడిఒ లక్ష్మీ నరసింహ,ఎంఇఒలు నరసింహారెడ్డి, రామాంజనేయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను తొలగించొద్దు

కార్మిక శాఖ అధికారికి సిఐటియు నేతల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ సర్వజనాసుపత్రి, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, మెడికల్, నర్సింగ్ కళాశాలల్లో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు, సూపర్‌వైజర్లను తొలగించొద్దని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్‌వి.నాయుడు, ఎస్.నాగేంద్రకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ఎజి.రాజమోహన్, నగర కార్యదర్శి ముత్తుజా డిమాండ్ చేశారు. 50 ఏళ్ల పైబడిన పారిశుధ్య కార్మికులు, డిగ్రీ అర్హత లేని సూపర్‌వైజర్లను తొలగిస్తున్నామని చెప్పిన నేపథ్యంలో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు సర్వజనాసుపత్రి ఎదుట దీక్షలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం కార్మిక సంఘాల నాయకులు, ఏజెన్సీ నిర్వాహకులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి జిల్లా కార్మిక శాఖ ఉప కమిషనర్ లక్ష్మయ్య అధ్యక్షతన జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ పద్మావతి హౌస్ కీపింగ్ ఏజెన్సీతో కుదిరిన థర్డ్ పార్టీ అగ్రిమెంట్‌లోని నిబంధనలను ఉల్లంఘిస్తూ, లేబర్ చట్టానికి విరుద్ధంగా 50 సంవత్సరాలు పైబడిన కార్మికులు, అర్హత పేరుతో సూపర్‌వైజర్లను బెదిరించి తొలగించడం సరికాదన్నారు. ఇప్పుడు పని చేస్తున్న వారిని కొనసాగించి, నూతనంగా చేపట్టే నియామకాల్లో నూతన నిబంధనలు అమలు చేయాలన్నారు. కావున నిబంధనలు ఉల్లంఘిస్తున్న పద్మావతి ఏజెన్సీ చర్యలను ఆపాలని డిసిఎల్ లక్ష్మయ్యను వారు విజ్ఞప్తి చేశారు. స్పందించిన డిసిఎల్ లక్ష్మయ్య రాష్ట్ర స్థాయి అధికారులు తీసుకోవాల్సిన నిర్ణయాలు కాబట్టి మీ సమస్యను కార్మిక శాఖ ద్వారా ప్రభుత్వానికి విన్నవిస్తామన్నారు. తమ పరిధిలో లేదని డిసిఎల్ చెప్పడంతో నాయకులు కార్మికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం డిసిఎల్ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైటాయించి ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్‌వి.నాయుడు, ఎస్.నాగేంద్రకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ఎజి.రాజమోహన్, నగర కార్యదర్శి ముత్తుజా, వైద్య ఆరోగ్య శాఖ సూపరింటెండెంట్ జెంబునాథ్, అతావుల్లా, పద్మావతి ఏజెన్సీ సిబ్బంది సాయితేజ్‌రెడ్డి, హరిప్రసాద్, కార్మికులు నల్లమ్మ, దేవా, నరేష్, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ధర్నాలో మాట్లాడుతున్న నాగేంద్రకుమార్

కర్బూజ పంటకు తెగులు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

ఎన్నో ఆశలతో రైతులు సాగు చేసిన కర్బూజపంటకు తెగులు సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని క్రిష్టిపాడు గ్రామలో పలువురు రైతులు నెలరోజుల క్రితం తీగజాతి కర్బూజ పంటను సాగు చేశారు. మొదటి నుంచి ఏపుగానే పెరిగినప్పటికీ ప్రస్తుతం దవనిబూడిద తెగులు సోకి పంటంతా ఎండుదశకు వచ్చినట్లు కనిపించడంతో రైతులకు దిక్కుతోచడం లేదు. ఎకరాకు ఏడు నుంచి పది టన్నుల దిగుబడులు వచ్చే పంటకు తెగులు సోకడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ పంటలు వేసినా దిగుబడులు రాకుండా పోతున్నాయని.. కర్బూజ పంటను సాగు చేస్తే ఈపంటకూ తెగులు సోకి తీరని నష్టాలను తెచ్చిపెడుతున్నాయని రైతులు అంటున్నారు. ఇంత జరుగుతున్నా ఉద్యానశాఖ అధికారులు కనీసం ఇటువైపు రాకపోవడంతో చాలామంది రైతులు పంటలు వేసి నష్టపోవాల్సి వస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆందోళనలో రైతులు

తెగులుతో దెబ్బతిన్న కర్బూజ పంట

తెగులుతో దిక్కుతోచడం లేదు : హాజీవలి, క్రిష్టిపాడు

రెండెకరాల్లో గోలెమౌరి రకం కర్బూజ పంటను సాగు చేశా. పంట చేతికొచ్చే సమయంలో వింతరకం తెగులు సోకి నష్టపరుస్తుండటంతో దిక్కుతోచడం లేదు. ఎకరాకు రూ.80వేల చొప్పున పెట్టుబడి పెట్టా. కనీసం పెట్టుబడులైనా దక్కుతాయా.. లేదా.. అని ఎదురుచూస్తున్నా. పంటలో ఈఏడాది కొంతవరకైనా దిగుబడులు వచ్చి కొంత నగదు వస్తుందనే ఆశలతో ఉండగా తెగులుతో ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

ఆశలు వదిలిపెట్టాం : శ్రీధర్‌నాయుడు, కడదరగుట్టపల్లి

ఈఏడాది ఎంతో ఆశతో రెండో పంటగా మూడెకరాల్లో తీగజాతి కర్బూజ పంటను సాగు చేశా. గతవారంలో మంచు, చలి ప్రభావంతో దవని బూడిద తెగులు సోకి ఆకులు ఎండిపోతున్నాయి. ఆకులు ఎండిపోవడంతో దిగుబడిపై ప్రభావం చూపుతోంది. దీంతో ఆశలను వదిలిపెట్టుకోవాల్సి వస్తోంది.

నీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

కుందుర్పిలో మూడు నెలలుగా తాగునీటి సమస్య

ప్రజాశక్తి-కుందుర్పి

తాగునీటి కోసం మండల కేంద్రంలోని విద్యుత్ నగర్‌కు చెందిన మహిళలు శుక్రవారం రోడ్డెక్కారు. దాదాపు మూడు నెలలుగా తాగునీటి సమస్య నెలకొన్న పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడని ఆగ్రహిస్తూ విద్యుత్‌నగర్‌కు చెందిన పలువురు మహిళలు ప్రధాన రహదారిపైకి వచ్చి రెండు గంటలపాటు నిర్బంధించారు. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ మూడు నెలలుగా నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించాలని, అటు అధికారులు, ఇటు సర్పంచుకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. చేసేది లేక ఆందోళనకు దిగినట్లు తెలిపారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ కాలనీ మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం ధర్నా చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి
www.prajasakti.com

'పిఎం ధన్‌ధాన్య'కు ప్రణాళికలు రూపొందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకం అమలు కోసం ఆయా శాఖల జిల్లా అధికారులు కలిసికట్టుగా ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకం (పిఎండిడికెవై) అమలుపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పిఎండిడికెవై అమలుకు సంబంధించి ఆయా శాఖల జిల్లా అధికారులు కలిసికట్టుగా పని చేయడం అత్యంత ముఖ్యమైందన్నారు. జిల్లాస్థాయితో పాటు మండల స్థాయి అధికారుల నుంచి కూడా ప్రణాళిక రూపొందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకం పరిధిలో 11 శాఖలకు సంబంధించి 36 పథకాలు అమలు అవుతుండగా, వ్యవసాయ, ఉద్యాన, అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ఆయా పథకాల అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, హార్టికల్చర్ డిడి ఉమాదేవి, డిసిఒ అరుణకుమారి, ఎపిఎంఐపి పీడీ రఘునాథరెడ్డి, పశుసంవర్ధక శాఖ జెడి ప్రేమ్‌చంద్, కెవికె శాస్త్రవేత్త మల్లేశ్వరి, డ్వామా పీడీ సలీమ్ బాషా, ఎల్‌డిఎం నరేష్‌రెడ్డి, డిఆర్‌డిఎ పీడీ శైలజ, పరిశ్రమల శాఖ ఎడి రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయండి

సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు

ప్రజాశక్తి-తాడిపత్రి

విశాఖపట్టణంలో ఈనెల 31వ తేదీ నుంచి నిర్వహించనున్న అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు పిలుపునిచ్చారు. ఈమేరకు శుక్రవారం తాడిపత్రిలో ఎపి బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయన్నారు. వెంటనే వాటిని రద్దు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే బీడీ కార్మిక చట్టం 1966, సంక్షేమ చట్టం 1976 నామమాత్రంగా మిగిలిపోయాయన్నారు. బీడీ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులు, జీఎస్టీ సవరణలు కూడా కార్మికులకు, చిన్న పరిశ్రమలకు భారంగా మారాయని తెలిపారు. వెంటనే ఆయా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీడీ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.ఉమాగౌడ్, నాయకురాలు నూర్జహాన్, రామాంజినమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

గుంతకల్లు : విశాఖలో ఈనెల 31వ తేదీ నుంచి నిర్వహించనున్న అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు వివిఎల్ నరసింహులు పిలుపునిచ్చారు. ఈమేరకు శుక్రవారం స్థానిక ప్రధాన రైల్వే స్టేషన్ వద్ద ఇందుకు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. రైల్వేలతో సహా అన్ని రంగాల్లో ప్రయివేటీకరణను ఆపాలన్నారు. అదేవిధంగా కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ, తదితర వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలపై మహాసభలో చర్చించి రాబోయే మూడేళ్లలో ఆందోళనలు, ఉద్యమాలకు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి.శ్రీనివాసులు, పట్టణ ప్రధాన కార్యదర్శి సాకే నాగరాజు, నాయకులు జయరాజ్, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

విలేకరులతో మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

ప్రభుత్వ భరోసా లేకనే రైతు ఆత్మహత్య

ఎపి రైతు సంఘం నాయకులు రాజారామిరెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

అరటి పంటకు గిట్టుబాటు ధర లభించకపోవడం, ప్రభుత్వ భరోసా లేకపోవడంతోనే రైతు నాగలింగం ఆత్మహత్యకు దారి తీసిందని ఎపి రైతుసంఘం నాయకులు రాజారామిరెడ్డి ఆరోపించారు. శుక్రవారం తాడిపత్రిలోని రైతుసంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నాగలింగయ్య ఆత్మహత్యను ప్రభుత్వ హత్యగా గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. దాదాపు మూడెకరాల్లో అరటి పంట సాగు చేసి పంటకు మార్కెట్‌లో ధర లేకపోవడంతో అప్పులు అధికమై ఆత్మస్థైర్యం కోల్పోయి ఆత్మహత్యకు పాల్పడాల్సి వచ్చిందని వాపోయారు. నాగ లింగయ్య అప్పులన్నీ ప్రభుత్వమే చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, పిల్లలకు ఉన్నత చదువులు చదివే వరకు ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల అధ్యక్షులు నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షురాలు శిరీషా, జిల్లా కమిటీ సభ్యుడు జయశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ : విప్ కాలవ

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎంపిడిఒ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ కాలవ నేరుగా ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఇందులో భాగంగా పలు సమస్యలపై 150 అర్జీలు వచ్చాయి. అనంతరం విప్ కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకే ప్రభుత్వం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మునివేలు, ఎంపిడిఒ విజయభాస్కర్, సచివాలయ ఉద్యోగులు, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ల లాభాల కోసమే కేంద్ర విత్తన చట్టం

ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు బిహెచ్ రాయుడు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

బడా కార్పొరేట్ల విత్తన కంపెనీల లాభాల కోసమే కేంద్ర ప్రభుత్వం విత్తన చట్టం ముసాయిదాను తీసుకొచ్చిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బిహెచ్.రాయుడు ఆరోపించారు. శుక్రవారం కళ్యాణదుర్గంలోని ఆర్‌అండ్‌బి బంగ్లా వద్ద విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర విత్తన చట్టం కార్పొరేట్ సంస్థలకు రైతుల నుంచి వేలకోట్ల రూపాయలు లాభాలు కొల్లగొట్టేందుకే తీసుకొచ్చినట్లు స్పష్టం అవుతుందన్నారు. 1966 విత్తన దిగుమతి చట్టం, దాని సవరణ చట్టం 1986 తర్వాత దేశం, రాష్ట్రాల్లోను విత్తనోత్పత్తి పెరిగి ప్రస్తుతం అనేక దేశాలకు ఎగుమతి చేస్తున్నామని వివరించారు. టాటా, బిర్లా, ఐటిసి లాంటి సంస్థలే కాక విదేశీ కార్పొరేట్ సంస్థలైన మోన్సాంటో, బేయర్, డూ-పాయింట్, సింజెంటా, కార్గిల్ సంస్థలు విత్తన రంగంపై పూర్తి పట్టు కలిగి ఉన్నాయన్నారు. విత్తన ధరలను ఇష్టానుసారంగా పెంచటం, నాణ్యత లేని విత్తనాలను, పాలినేషన్ తక్కువ ఉన్న విత్తనాలను రైతులకు అంటగట్టి లాభాలు సంపాదిస్తున్నారన్నారు. రాష్ట్రాల స్థాయిలో నిపుణులతో సమావేశాలు ఏర్పాటు చేసి విత్తన ముసాయిదాను రూపొందించాలని డిమాండ్ చేశారు.

ఆసుపత్రి అభివృద్ధికి సహకరించాలి

ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

ప్రభుత్వ నిధులతో నూతనంగా నిర్మించిన ఆసుపత్రిని అభివృద్ధి చేసేందుకు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి కోరారు. పెద్దవడుగూరులో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో అన్నిరోగాలకు వైద్య సదుపాయం ఉందన్నారు. ప్రజలందరూ ఆసుపత్రి వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ఆసుపత్రిలో కమిటీ ఏర్పాటు చేసుకుని అభివృద్ధిపై చర్చించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ ఇబి దేవి, వైద్యులు పుష్పలత, సునీత, తహశీల్దార్ ఉషారాణి, ఎంపిడిఒ బారన్‌సాహెబ్, టిడిపి నాయకులు గంగరాజు, కొండూరు కేశవరెడ్డి, కన్వీనర్ నాగేశ్వరరెడ్డి, ఉత్తర కాలవ డిస్టిబూటర్స్ ఛైర్మన్ రాజారెడ్డి, తిలక్‌రెడ్డి, ఇటుకనాలు ప్రసాద్‌నాయాదవ్, హరినాథరెడ్డి, హరికృష్ణారావు, కూన రామకృష్ణారెడ్డి, చిరంజీవులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి

న్యాయశాస్త్ర ఫలితాలను విడుదల చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి -అనంతపురం

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం న్యాయశాస్త్ర విభాగంలో 1, 4వ సెమిస్టర్ల ఫలితాలను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు తరిమెల గిరి, యూనివర్సిటీ కార్యదర్శి శాంతిరాజు, అధ్యక్షులు పవన్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు రాసి ఫలితాల కోసం నిరీక్షిస్తున్నారన్నారు. అలాగే కొంతమంది సప్లిమెంటరీ రాసిన విద్యార్థులు ఫలితాలు రాక ఎన్‌రోల్‌మెంట్‌కు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున తక్షణమే న్యాయశాస్త్రంలో పెండింగ్‌లో ఉన్న సెమిస్టర్ల ఫలితాలను విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు వంశీ, శివారెడ్డి, శివ, విజయ్, సందే, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలి

కమిషనర్ బాలస్వామి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో పారిశుధ్యాన్ని మెరుగు పరిచేందుకు రోజూ ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేయడంతోపాటు చెత్తకుప్పలను 24 గంటల్లోపు తొలగించాలని కమిషనర్ బాలస్వామి ఆదేశించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, సచివాలయ శానిటరీ సెక్రటరీలతో సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా నగరంలో పారిశుధ్యం మెరుగు పరచడానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా అందరూ శానిటేషన్ సెక్రటరీలు, పారిశుధ్య కార్మికులు ఉదయం 5.30 గంటలలోపు విధులకు హాజరు కావాలన్నారు. అందరూ శానిటేషన్ సెక్రటరీలు వైర్లెస్ సెట్లు కచ్చితంగా ఉపయోగించి జవాబుదారీగా ఉండాలన్నారు. రోజూ ఇంటింటి చెత్త సేకరణతోపాటు పరిసరాల్లో ఉన్న చెత్తకుప్పలను 24 గంటల్లోపు తొలగించాలన్నారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ రాజశేఖర్, హెల్త్ ఆఫీసర్ నరసింహా, డిప్యూటీ కమిషనర్ పావని, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ బాలస్వామి

పారిశుధ్య పనులు పరిశీలన

రోజువారి పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ బాలస్వామి శుక్రవారం సూర్యానగర్ రోడ్డులో చేపట్టిన పారిశుధ్య పనులను పరిశీలించారు. తదుపరి బళ్లారి రోడ్డు, జూనియర్ కళాశాలలో ఉన్న అన్నాక్యాంటీన్ల సందర్శించి అల్పాహారం నాణ్యత, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు.

ఆర్ట్స్ కళాశాలలో పీజీ స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-అనంతపురం

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో (స్వయంప్రతిపత్తి) వివిధ పీజీ కోర్సుల్లో మిగిలిన సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.పద్మశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9, 10వ తేదీల్లో నేరుగా ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఎపిపిజిసి సెట్-2025 క్వాలిఫై కాని వారు, రాయని వారు కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

పుట్లూరు : రెండు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్న మండలంలోని వెల్లుట్ల గ్రామ రైతు నాగలింగయ్య కుటుంబానికి శింగనమల మార్కెట్ యార్డు ఛైర్మన్ దండు శ్రీనివాసులు శుక్రవారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ముందుగా నాగలింగయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శింగనమల రంగరాయుల చెరువు ఆయకట్టు ప్రెసిడెంట్ జి.సత్యనారాయణ, అనిల్‌కుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న దండు

భాష్యం విద్యార్థులకు అభినందన

విద్యార్థులను అభినందిస్తున్న భాష్యం యాజమాన్యం

ప్రజాశక్తి-అనంతపురం

జాతీయస్థాయి ఆటల పోటీల్లో గెలుపొందిన భాష్యం విద్యాసంస్థల విద్యార్థులను మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్‌రామ్ శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సాకేత్‌రామ్ మాట్లాడుతూ భాష్యం విద్యాసంస్థల్లో విద్యతోపాటు ఆటలకు సముచిత స్థానం ఇస్తున్నట్లు తెలిపారు. ఆయా విద్యార్థులను పాఠశాల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్‌ఛైర్మన్ హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్‌రామ్, జిల్లా జెడీవో రవివర్మ, ప్రిన్సిపాల్ బాలకృష్ణ అభినందించారు

నైపుణ్యాలను పెంపొందించడమే 'బూట్‌క్యాంప్' లక్ష్యం

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థుల్లోని సృజనాత్మకత, నైపుణ్యాలను పెంపొందించడమే బూట్‌క్యాంప్ లక్ష్యమని జెఎన్‌టియు రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య అన్నారు. అనంతపురం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పార్క్ 3-రోజుల ఐడియా ఎక్స్‌ప్లోరేషన్ బూట్‌క్యాంప్ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆలోచనలను స్టార్టప్‌లుగా అభివృద్ధి చేసేందుకు విశ్వవిద్యాలయం అందించే మద్దతును వినియోగించుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో జెఎన్‌టియు ఇన్క్యుబేషన్ సెల్ డైరెక్టర్ సి.శోభాబిందు, అటల్ ఇన్క్యుబేషన్ సిఇఒ చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

బూట్ క్యాంపునకు హాజరైన విద్యార్థులు

శిశు సంక్షేమానికి చర్యలు

డిఎంహెచ్ఒ ఇబి దేవి

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో ఏ శిశువుకూ ఆరోగ్య సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి ఇబి దేవి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం సమావేశ భవనంలో చిన్నపిల్లల వైద్యుల సంఘం ఆధ్వర్యంలో చిన్నపిల్లల్లో పుట్టుకతో వచ్చే వ్యాధులు, నివారణతో పాటు వ్యాధులు రాకముందే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్య నిపుణులు ఉదయ్‌భాస్కర్, డాక్టర్ శంకర్‌నారాయణ, భాస్కర్‌నాయక్, డిఐఒ డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి, విష్ణుమూర్తి, రాధిక, సిబ్బంది పల్లవి, రాధ, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

స్క్రబ్ టైపస్‌పై అప్రమత్తంగా ఉండాలి

స్క్రబ్ టైపస్‌పై జిల్లాలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిఎంహెచ్ఒ ఇబి దేవి సూచించారు. తీవ్ర తలనొప్పి, జ్వరం, నొప్పులు, శరీరంపై దద్దుర్లు, కళ్ల కలక వంటి లక్షణములు కనిపిస్తాయన్నారు. ఆయా లక్షణాలు కనిపించిన వెంటనే సమీప పిహెచ్‌సి, సిహెచ్‌సి సెంటర్లను సంప్రదించాలని సూచించారు.

ప్రాంగణ నియామకాల్లో 47 మంది ఎంపిక

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం 'డెలిఫి టీవీఎస్ టెక్నాలజీస్' కంపెనీ నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 47 మందిని ఇంటెన్షిప్‌నకు ఎంపిక చేసినట్లు జెఎన్‌టియు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జె.శ్రీనివాసులు తెలిపారు. వీరికి నెలకు రూ. 16,058 వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను డైరెక్టర్ అఫ్ ఇండస్ట్రియల్, ప్లేస్‌మెంట్ ఆర్.కిరణ్మయి, కళాశాల ప్రిన్సిపాల్ పి. చెన్నారెడ్డి అభినందించారు.

ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

పెద్దపప్పూరు : మండలం కేంద్రంలోని జడ్పీహెచ్ హైస్కూల్‌లో బాల్యవివాహాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ చిన్న వయస్సులోనే బాల్య వివాహాలు చేయడం వల్ల అనేక అనార్థాలు సంభవిస్తాయన్నారు. కావున పెళ్లి వయస్సు వచ్చిన తర్వాతనే వివాహాలు చేయాలన్నారు. అనంతరం తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఐసిటిసి సూపర్వైజర్ విజయ, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవి పరీక్ష కేంద్రాలు పున:ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వ మెడికల్ కళాశాలలోని మైక్రోబయాలజీ విభాగంలో ఉన్న హెచ్ఐవి పరీక్ష కేంద్రాలను డిఎంహెచ్ఒ ఇబి దేవి శుక్రవారం పున:ప్రారంభించారు. గతనెల 11వతేదీన ప్రభుత్వ మెడికల్ కళాశాలలోని మైక్రోబయాలజీ విభాగంలో ఉన్న హెచ్ఐవి ఎస్ఆర్ఎల్, వైరల్‌లోడ్ ల్యాబ్‌లో షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో ల్యాబ్‌లు కాలిపోయాయి. ఈనేపథ్యంలో నవంబర్ 13న ఎపి ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జేడీ డాక్టర్ కామేశ్వర ప్రసాద్ ల్యాబ్‌ను పరిశీలించి నిధులు మంజూరు చేశారు. దీంతో పరీక్ష కేంద్రాలను పున:ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ టి.మధు, మైక్రోబయాలజీ విభాగాధిపతి బి.శాంతిరెడ్డి, అసోసియట్ ప్రొఫెసర్లు, ల్యాబ్ ఇన్‌ఛార్జిలు డాక్టర్ హైమావతి, డాక్టర్ శైలజ, టెక్నికల్ ఆఫీసర్స్ డాక్టర్ అనురాధ, డాక్టర్ నాగమణి, ల్యాబ్ టెక్నీషియన్లు గురుప్రసాద్, నరేశ్ పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ ఇబి దేవి

నేలను పరిరక్షించుకుంటే అధిక దిగుబడులు

ప్రజాశక్తి-అనంతపురం

రైతులు నేలలని పరిరక్షించుకున్నప్పుడే మంచి దిగుబడులు సాధ్యమని భూసార పరీక్ష కేంద్రం ఎడిఎ ఎల్.రోజా పుష్పలత సూచించారు. ప్రపంచ నేల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక భూసార పరీక్ష కేంద్రం ఆధ్వర్యంలో 'నేలలను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత, దాని ద్వారా ఆరోగ్యవంతమైన దిగుబడి ఎలా సాధించాలి' అన్న విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా మట్టి నమూనాలు సేకరించే పద్ధతి, ఎలాంటి ప్రదేశాల్లో తీయాలనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం విభాగం సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మానాయక్, వ్యవసాయ అధికారి టి.కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక పిఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో శుక్రవారం వార్షిక క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా అటవీ అధికారి టి.చక్రపాణి శారీరక దారుఢ్యం, పర్యావరణంపై అవగాహన, క్రీడల ద్వారా వ్యక్తిత్వ వికాసం ప్రాముఖ్యతను వివరించారు. విద్య, క్రీడారంగాల్లో విశిష్టతను సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మార్కండేయులు, శారీరక విద్య ఉపాధ్యాయుడు నసీం, తదితరులు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలను అందుకుంటున్న విద్యార్థినులు

డిప్యూటీ ఎంపిడిఒగా కె.వరప్రసాద్‌రావు

యల్లనూరు : యల్లనూరు మండలం డిప్యూటీ ఎంపిడిఒగా కె.వరప్రసాద్‌రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అన్నమయ్య జిల్లా నుంచి బదిలీపై ఇక్కడి వచ్చి బాధ్యతలు చేపట్టారు.

గుత్తి రైల్వే షెడ్డుకు ప్రథమ స్థానం

గుంతకల్లు డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

ప్రజాశక్తి-గుత్తి

ఇండియన్ రైల్వేస్‌లో గుత్తి డీజిల్ లోకో షెడ్డు ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమని గుంతకల్లు డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా అన్నారు. శుక్రవారం గుత్తి రైల్వే డీజిల్ లోకో షెడ్ 62వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా డిఒఆర్ఎంతోపాటు ఎడిఆర్ఎం సుధాకర్, గుంతకల్లు ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు మమతాగుప్తా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం కేక్ కోసి పంచిపెట్టారు. తర్వాత గుత్తి డీజిల్ రైల్వే షెడ్డుకు రూ.25వేల అవార్డును ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు ప్రధాన వైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఎస్ఇ జనరల్ మెకానికల్ ఇంజనీర్ శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఇంజనీర్ గోవిందరాజులు, గుత్తి డీజిల్ షెడ్ రమేష్, ఉమెన్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు రేవతి రమేష్, ఎడిఎం అశోక్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డిఆర్ఎం

ఎస్‌విఐటిలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-రాప్తాడు

శ్రీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో శుక్రవారం క్యూ స్పైడర్ సంస్థ నిర్వహించి జాబ్‌మేళాలో 16 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ విబిఆర్ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ఛైర్మన్ బివి కృష్ణారెడ్డి, వైస్ ఛైర్మన్ వెన్నెపూస రవీంద్రారెడ్డి, ఎండి వెన్నెపూస రమాకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ టి.విష్ణువర్ధన్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె.సత్యవర్ధన్‌రెడ్డి, శశాంక్, తదితరులు అభినందించారు.

చెక్‌బౌన్స్ కేసులో ఏడాది జైలు

న్యాయం గెలిచింది : ఎంపిపి ఆదినారాయణ యాదవ్

ప్రజాశక్తి-అనంతపురం

ఐదేళ్ల క్రితం తనకు ఇవ్వాల్సిన డబ్బుకు చెక్కులు ఇచ్చి మోసం చేసిన లక్ష్మీ భర్త అమిలినేని నరేష్‌కు అనంతపురం ఫస్ట్ స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టు రూ.9 కోట్ల నగదు, ఏడాది జైలుశిక్ష విధించింది. ఈ సందర్భంగా ముదిగుబ్బ ఎంపిపి ఆదినారాయణ యాదవ్ మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం తనకు ఇవ్వాల్సిన డబ్బుకు చెక్కులు ఇచ్చారన్నారు. అయితే ఆయా చెక్‌లు బౌన్స్ కాగా ఎన్నిసార్లు విన్నవించుకున్నా నగదు ఇవ్వకపోవడంతో కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. తనవైపు న్యాయం ఉంది కాబట్టే ఇప్పుడు రూ.5కోట్లకు వడ్డీతో సహా రూ.9కోట్ల నగదు, ఏడాది పాటు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. దీంతో తనకు న్యాయం జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు.

క్రికెట్‌లో ఒటిపిఆర్ఐ జట్టు విజయం

ప్రజాశక్తి-అనంతపురం

జాతీయ ఫార్మసీ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీలో జెఎన్‌టియు ఒటిపిఆర్ఐ జట్టు విజయం సాధించింది. ఇందులో భాగంగా శనివారం జరిగిన ఫైనల్ పోటీలో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ జట్టుపై ఆరు వికెట్ల తేడాతో ఒటిపిఆర్ఐ జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా ఒటిపిఆర్ఐ సంచాలకులు జివి సుబ్బారెడ్డి విజేత జట్టును అభినందించి ముందు ముందు ఇలాంటి ఎన్నో విజయాలను సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా ఒటిపిఆర్ఐ జట్టు కెప్టెన్ బి.హరిబాబుతోపాటు క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.ధనుంజయను సంస్థ సంచాలకులు జివి సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ సి.గోపీనాథ్, డిప్యూటీ రిజిస్ట్రార్ బి.దుర్గాప్రసాద్ అభినందించారు.

క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

IN THE COURT OF THE VIIth ADDL.DIST JUDGE CUM FAMILY COURT: ANANTAPUR.
EP.No: 113/2025 in A.A No:10/2024

Between:
Sree Mallikarjuna Auto Finance, rep. by its Managing partner E.Gurreddy, rep by its GPA holder PeramSudarshan Reddy **..Petitioner/D.Hr**

AND

C.Venkateswarulu & others **...Respondents/J.Drs**

J.Dr1: C.Venkateswarulu, S/o. C.Peddaiah, D.No.19-403, Rani nagar, 2nd cross, Old town, Ananthapuramu.

J.Dr1కి Order 21 Rule 37 నోటీసు

Petitioner బాకీ మొత్తం రాబట్టుకొనుటకు గాను మీ పై దాఖలు చేసిన E.P లో 1వ J.Dr అయిన మీరు 30-12-2025వ తేదీన హాజరు అగుటకు గాను వాయిదా ఉన్నది. పై దినం ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట ఖుద్దున గాని మీ తరపున వకీలుగానీ హాజరై మీ అక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
K.CHANDRASEKHAR RAO
Advocate, Ananthapuramu
Cell No: :9848504780

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, GOOTY
O.S. No: 115/2017

Between:
B.Ramanjinamma and others **..Plaintiffs**

AND

B. Mallamma, died by her LRs,
B.Anjineyulu and others **...Defendants**

NOTICE TO DEFENDANT NO'S:8,10,12&13

D8: B.Pothappa S/o Late B. Masthanappa, Donekal (V), Vidapanakal (M).
D10: B Manohar S/o Late. B. Masthanappa D.No. 13/250-C-1, Santhosh Nagar, Guntakal.
D12: B.Hari,S/o Late. B.Masthanappa,D.No. 13/250-C-1, Santhosh Nagar,Guntakal.
D13: B. Nagalakshmi W/o Beldari Seena, D/o Late B.Masthanappa, New Bus-stand Back side, Pamidi.

పై నెంబరు కేసులో ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తము 17-12-2025వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
M.V. MAHESH KUMAR,
Advocate, Gooty
Cell No: 9440458601.

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE, ANANTAPURAMU
E.P.No. 90/2022 in O.S. No: 18/2016

Between:
D.Sulochana. **...Petitioner/D.Hr**

AND

V.Obaiah and others **...Respondents/J.Drs.**
J.Dr 1: V.Obaiah S/o late Obanna, D.No:6/3/860
J.Dr 2: V.Narayanamma W/o V.Obaiah, D.No:6/3/859
J.Dr 3: V.Saraswathi W/o V.Obaiah, D.No:6/3/823/5,
J.Dr 4: V.Lakshminarayana S/o Obaiah, D.No;2/7/352,
J.Dr 5: V. Obulesu S/o Obaiah,D.No:2/7/352
J.Dr 6: V.Ravi S/o Obaiah
J.Dr 7: V.Suresh Babu S/o Obaiah, D.No:6/3/860
All are R/o Sanghamitra colony, Maruthi Nagar, Anantapuramu.

J.Dr's కి Order 21 Rule 66 CPC నోటీసు

డిక్రీ హోల్డరుకు రావలసిన E.P మొత్తము వసూలు చేయుటకు గాను E.P లోని షెడ్యూలు ఆస్తిని జప్తు చేసియున్నారు. సదరు E.P వేలము షరుతలు నిర్ణయించుటకు మీ యొక్క హాజరు నిమిత్తము 10-12-2025 వేసియున్నారు. అందులకు మీకు ఆక్షేపణలున్న యెడల సదరి దినం ఉదయం 10-30 గంటలకు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టు యందు హాజరు కావలెను. లేని యెడల మీ పరోక్షము నందు పై అర్జీని విచారించి తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
A.SURESH KUMAR Advocate,
Ananthapuramu, Cell No: 9440204098

Kalyandurgam Municipality

e - Procurement Tender Notice

Tender Notice IFB No.43/2025-26 to 55/2025-26, BPS & LRS Fund and Municipal General Funds

Name of scheme	LRS & BPS Funds & Mpl. General Funds
No.of Works	12 Nos
Works	HDPE Pipeline and Civil Works
Total Estimated Amount	70.00 lak
Name and Address of Concerned Officer	Municipal Commissioner, Kalyanadurgarn Municipality, Kalyanadurgam. (Further Details can be obtained https://tender.apeprocurement.gov.in/login.html)

Sd/- S.Vamsi Krishna Bhargava
Municipal Commissioner
Kalyanadurgam Municipality

విలువలతో కూడిన విద్య అవసరం

ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ పూల నాగరాజు

ప్రజాశక్తి-అనంతపురం

పాఠశాల స్థాయిలో విలువలతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే బలమైన పునాది ఏర్పడుతుందని ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ పూల నాగరాజు అన్నారు. శుక్రవారం అనంతపురంలోని కెఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్, స్టూడెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే మెరుగైన విద్యను అందించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ ఆలోచనతో శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో వీరశైవ లింగాయత్, ఛైర్‌పర్సన్ స్వప్న, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అరటి రైతులకు అవగాహన

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండల కేంద్రంతోపాటు ముచ్చుకోట, ధర్మాపురం, గార్లదిన్నె, పసులూరు, గ్రామాల్లో సాగు చేసిన అరటి తోటను ఆర్‌హెచ్ఆర్ఎస్ తిరుపతి రీసెర్చ్ సెంటర్ సీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాసులు, ఉద్యానవన జిల్లా అధికారిణి ఉమాదేవి, ఎపిఎంఐపి పీడీ రఘునాథరెడ్డి శుక్రవారం పరిశీలించారు. అనంతరం ముచ్చుకోట రైతు సేవాకేంద్రంలో అరటి పంటపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎడిహెచ్ దేవానంద్, రైతులు, రైతు సేవా కేంద్రం అధికారులు పాల్గొన్నారు.

'మంత్రి లోకేశ్ తీరు విడ్డూరం'

ప్రజాశక్తి-గుంతకల్లు

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీరు విడ్డూరంగా ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్ ఎద్దేవా చేశారు. శుక్రవారం స్థానిక వీటి పకీరప్ప భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పాఠశాలలు, కళాశాలల్లోకి విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు వెళ్లరాదని జీవో జారీ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అయితే మెగా పేరెంట్స్ మీటింగ్‌కు టిడిపి ప్రధాన నాయకులు పార్టీ జెండాలతో పాల్గొనాలని చెప్పడం బాధాకరమన్నారు. ఆయా జీవోలను ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు బి.గోవిందు, వి.జాన్సన్ బాబు, ఎం.వీరభద్రస్వామి, బి.మహేష్, సాకే.గోపీనాథ్, ఎస్ఎండి.గౌస్, రాము రాయల్ వై.రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి-బెలుగుప్ప

ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరించడాన్ని నిరసిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో వైసిపి నాయకులు కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఇందులో భాగంగా మండల వ్యాప్తంగా దాదాపు 8వేల మందికి పైగా సంతకాలు సేకరించినట్లు వైసిపి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పురుషోత్తం రాజు, కరుణాకర్, పురుషోత్తం రాజా, పూల ప్రసాద్, బాబురెడ్డి, గోవింద్‌రెడ్డి, వెంకటేశులు, ఎంపిటిసి వీర బొమ్మన్న, రమేష్, గురుమూర్తిరెడ్డి, నరసింహారెడ్డి, పాతన్న, భీమన్న, మాల తిప్పేస్వామి, ఎర్రగుడి ఎర్రిస్వామి, నరిగన్న, ఆవులన్న గోపాల్, నారాయణస్వామి, తండా సుంకానాయక్, గోవిందనాయక్, అశోక్, సంతోష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-బెలుగుప్ప

మండల పరిధిలోని ఎర్రగుడి గ్రామంలో పయ్యావుల సోదరుల ఆధ్వర్యంలో ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి బళ్లారి వారి సహకారంతో శుక్రవారం ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా 58 మందికి కంటి పరీక్షలు చేయగా 22 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. అలాగే ప్రాథమికోన్నత పాఠశాలలో 66 మంది విద్యార్థులకు పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు లక్ష్మీనారాయణ, ఎర్రిస్వామి, ప్రభాకర్, చిరంజీవి, వైద్య సిబ్బంది మారన్న, కరిబసవ, వాసు, మల్లికార్జున, దేవీప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం మండలంలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

విద్యార్థినులతో మాట్లాడుతున్న కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

పాఠశాలల అభివృద్ధికి కృషి

'మెగా పేరెంట్స్-టీచర్స్' మీటింగ్‌లో ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్రంలోని పాఠశాలల అభివృద్ధికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మెగా తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థినుల విద్యా పురోగతి, ప్రతిభ, పాఠశాల అభివృద్ధి కోసం అవసరమైన సౌకర్యాలపై తల్లిదండ్రులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ వెంకట రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని జయప్రద, టిడిపి పట్టణ అధ్యక్షులు కృష్ణమూర్తి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండలంలోని కొర్రపాడు వద్ద ఉన్న అంబేద్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన 'మెగా పేరెంట్స్-టీచర్స్' కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పాల్గొన్నారు. ముందుగా పాఠశాల ఆవరణలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సిఎస్ఆర్ సేవ్ ఇండియా, లీవ్ హ్యూమన్ ఫౌండేషన్ సహకారంతో పాఠశాలలో నిర్మించిన ఓపెన్ ఆడిటోరియంను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, ఎంపిపి సునీత, ప్రిన్సిపాల్ సునీత, తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎంపిడిఒ సల్మాన్, సిఐ పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : పెద్దవడుగూరులోని ప్రభుత్వ ఉన్నత, కెజిబివి పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన 'మెగా పేరెంట్స్-టీచర్స్' కార్యక్రమంలో ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి పాల్గొన్నారు. ఇందులో భాగంగా విద్యార్థుల సమస్యలు, పాఠశాలల్లో విద్యాబోధన తీరుపై విద్యార్థులు, తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా పాఠశాల విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్‌వి రవీంద్రారెడ్డి, హరినాథరెడ్డి, గంగరాజు, కన్వీనర్ నాగేశ్వరరెడ్డి, కేశవరెడ్డి, బాలిరెడ్డి, ఉత్తర కాలువ డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ రాజారెడ్డి, కూన వెంకటరెడ్డి, దాదావలి, హరికృష్ణారావు, చిరంజీవి, వెంకట్రామిరెడ్డి, రమేష్‌యాదవ్, బాషా, ప్రసాద్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : విద్యారంగం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎపి ఆదర్శ పాఠశాలలో విద్యాకమిటీ ఛైర్మన్ గొల్ల బాలపవన్‌కుమార్ యాదవ్ అధ్యక్షతన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ జి.వెంకట శివుడు యాదవ్, టిడిపి మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్, కమిషనర్ బి.జబ్బర్‌మియా, ఎంపిడిఒ డి.ప్రభాకర్, ప్రిన్సిపాల్ డి.ప్రశష్టతకుమారి, నాయకులు కె.చికెన్ శీనాయాదవ్, ఎంకె.చౌదరి, బి.లక్ష్మీరంగయ్య, టి.మారుతీప్రసాద్, పల్లా సాంబశివ యాదవ్, బి.రమేష్, ఆర్ఎస్.రాజా, ఎన్.సుధాకర్‌నాయుడు, బోర్‌వెల్ నాగరాజు, కోనంకి కృష్ణ, సి.లక్ష్మణ్‌చౌదరి, పిల్లేల్లి కృష్ణయ్య, పి.సుధాకర్, మందల నాగరాజు, జి.సునిల్, తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి : స్థానిక జూనియర్ కాలేజీలో నిర్వహించిన 'మెగా పేరెంట్స్-టీచర్స్' కార్యక్రమంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇందులో భాగంగా విద్యార్థుల సమస్యలు, కళాశాలలో సౌకర్యాలపై విద్యార్థులు, తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి జూనియర్ కళాశాల వరకూ ద్విచక్ర వాహనాల ర్యాలీగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ధనుంజయ, నాయకులు రంగనాథ్, వైబి ఓబయ్య, రామ్మూర్తినాయుడు, రాఘవేంద్ర బాబు, పెద్ద నరసింహప్ప, శివలింగప్ప, తిప్పేస్వామి, తాహిర్, రవి, మల్లికార్జున, తహశీల్దార్ ఓబులేష్, ఎంపిడిఒ మాధవి, వైద్యాధికారిణి తరుణ్‌సాయి, తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో విద్యార్థినికి ఐడి కార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు

ఆడిటోరియంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

పెద్దవడుగూరు మండలంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి

క్రీడల్లో మెడికోల విజయం స్ఫూర్తిదాయకం

మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.విజయశ్రీ

ప్రజాశక్తి-అనంతపురం

రాజమండ్రి జిఎస్ఎల్ మెడికల్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన క్రీడల్లో అనంతపురం మెడికోల విజయం స్ఫూర్తిదాయకమని అనంతపురం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయశ్రీ కొనియాడారు. వాలీబాల్, చెస్, ఫుట్‌బాల్, టెన్నిస్ పోటీల్లో అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల మెడికోలు పాల్గొని బహుమతులు సాధించినట్లు తెలిపారు. ఈమేరకు ఆయా మెడికోలను అభినందించారు. మెడికోలను అభినందించిన వారిలో వైస్ ప్రిన్సిపాళ్లు శంకర్, షారోన్ సోనియా, తెలుగు మధుసూదన్, తదితరులు ఉన్నారు.

మెడికోలను అభినందిస్తున్న దృశ్యం

చట్టాలపై అవగాహన

పుట్లూరు : చట్టాలపై మండల కేంద్రంలో ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శిగా ఎస్ఎం హరూన్ రషీద్

అనంతపురం : ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శిగా ఎస్ఎం అరుణ్ రషీద్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 3, 4వ తేదీల్లో గుంతకల్లులో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల్లో హరూన్ రషీద్‌ను ఎంపిక చేశారు.

అగ్నిమాపక భవన నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

రాష్ట్ర పోలీసు గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో రూ.2.25 కోట్లతో కళ్యాణదుర్గంలో నిర్మించిన అగ్నిమాపక కేంద్రాన్ని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అగ్నిమాపక సిబ్బందికి సొంత భవనం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. సమస్యను రాష్ట్ర హోంమంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లి అనుమతులు మంజూరు చేయించి పూర్తి చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ లక్ష్మీరమేష్, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ వైపి రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

6, 7 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పర్యటన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఈనెల 6, 7వతేదీల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ ఓ.ఆనంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీన ఉదయం విజయవాడ నుంచి బయలుదేరి బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారని, అక్కడి నుంచి బయలుదేరి రోడ్డు మార్గాన అనంతపురం కలెక్టరేట్‌కి వస్తారన్నారు. అనంతరం అనంతపురం కలెక్టరేట్‌లో పీఎం కుసుమ్, పీఎం సూర్యఘర్, అన్ని ఎన్ఆర్ఈడిసిఎపి ప్రాజెక్టులపై ఆయా శాఖల జిల్లా అధికారులతో సీఎస్ సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. రాత్రికి అనంతపురంలోనే బస చేసి, మరుసటి దినం 7వ తేదీ ఉదయం 10 గంటలకు అనంతపురం నుంచి రోడ్డు మార్గాన హైదరాబాద్‌కు సిఎస్ తిరుగు ప్రయాణం కానున్నారని కలెక్టర్ తెలిపారు.